క్లుప్తంగా

రైతులు యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ మలేష్‌కుమార్

సి.బెళగల్: మండల రైతులు వ్యవసాయ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మలేష్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక మండల వ్యవసాయ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించి పలు అంశాలపై సభ్యులు, రైతులు, వ్యవసాయ సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై వ్యవసాయ పరికరాలు, యంత్రాలను అందిస్తోందన్నారు.సమావేశంలో రైతాంగ అభివృద్ధి ప్రభుత్వం తీసుకున్న చర్యలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ఏఓ వివరించారు. సమావేశంలో ఏఈఓ సిద్ధు, వీఏఏలు, ఎంపీఈఓలు, రైతులు, సలహా కమిటీ సభ్యులు ఉన్నారు.

బాధ్యతాయుతంగా పనిచేయాలి



కల్లపరి సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ చంద్రశేఖర్

కోడుమూరు రూరల్: గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతాయుతంగా పని చేసి ప్రజలకు సకాలంలో సేవలందించాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని పులకుర్తి, కల్లపరి గ్రామ సచివాలయాలను తనిఖీ చేసి కార్యాలయ రికార్డులను, సిబ్బంది హాజరు, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. ప్రతి రోజు సచివాలయాల్లో సాయంత్రం స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

నేడు జి.సింగవరంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం జి సింగవరంలో 9, 10 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని కర్నూలు ఎంపీడీఓ అజాంఖాన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ హాజరవుతారని తెలిపారు. మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కల్లూరు: హమాలీ కార్మికుల రాష్ట్ర ఫెడరేషన్ ఇచ్చిన దశల వారి పోరాటం పిలుపులో భాగంగా హమాలీ, జట్టు, ముఠా, కళాసి, కారిక్మల సమగ్ర చట్టం, వెల్ఫేర్ బోర్డు, సంక్షేమ నిధి ఏర్పాటు చేయాలని కోరుతూ కర్నూలు హమాలీ ఫెడరేషన్ సభ్యులు కోరారు. శుక్రవారం కర్నూలు హమాలీ ఫెడరేషన్ న్యూసిటీ కమిటీ ఆధ్వర్యంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పని ప్రదేశంలో వసతులు కల్పించాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ పథకాలతో కూడిన సమగ్ర చట్టం ఏర్పాటుపై శాసన సభ దృష్టి తీసుకెళ్లాలన్నారు. సీఐటీయూ నాయకులు పీఎస్ రాధాకృష్ణ, సీహెచ్ సాయిబాబా, నరసింహులు, రాముడు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

14, 15న మండల స్థాయి క్రీడా పోటీలు

కల్లూరు: ఈ నెల 14, 15వ తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు కర్నూలు నగరంలోని ఔట్‌డోర్ స్టేడియం నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కల్లూరు అర్బన్ ముజఫర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల వ్యాయమ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. క్రీడల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా ప్రోత్సాహం అందించాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్, జిల్లా వ్యాయమ ఉపాధ్యాయ సంఘం సెక్రటరీ వెంకటేశ్వర్లు, పాణ్యం నియోజకవర్గం ఇన్‌చార్జ్ పాల్ సుధాకర్, మండల ఇన్‌చార్జ్ అబ్రహాం లింకన్ తదితరులు పాల్గొన్నారు.

వైన్‌షాపు సేల్స్‌మెన్‌పై దాడి

గడివేముల: మండల కేంద్రంలోని వైన్‌షాప్‌లో సేల్స్‌మెన్‌పై దాడిచేసిన ఘటనలో ఇద్దరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల మేరకు.. గడివేముల గ్రామానికి చెందిన తెలుగు మురళి, సురేష్ వైన్ షాపు వద్దకు వెళ్లి మద్యం బాటిల్ అప్పు ఇవ్వాలని కోరారు. దీనికి నిరాకరించిన సేల్స్‌మెన్ దాసరి రాజేష్‌పై దుకాణంలోకి ప్రవేశించి కొట్టి గాయపరిచారు. ఘటనపై రాజేష్ ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ శుక్రవారం రాత్రి చెప్పారు.

చంద్రబాబు అక్రమాలపై నోరు మెదపరేం?

- రూ.118 కోట్లు కాజేసినందుకే ఐటీ నోటీసులు
- టీవీ 9 ప్రజానగర్‌లో సర్పంచ్ జయన్న ఆక్రమణలు
- గార్గేయపురం చెరువు అక్రమ రిజిస్ట్రేషన్‌పై లోకాయుక్తను ఆశ్రయిస్తాం
- కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్



టీవీ9 ప్రజానగర్ కాలనీలో విష్ణు అనుచరులు అక్రమంగా ఏర్పాటు చేసుకున్న కొట్టాల చిత్రాన్ని చూపిస్తూ మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు(న్యూటౌన్): టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమంగా రూ.118 కోట్లు కాజేస్తే సొంత కొడుకు నారా లోకేష్, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, బీజేపీ నాయకురాలు పురంధేశ్వరి నోరు మెదపకపోవడం దారుణమని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్టాంటన్‌పురంలోని వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చంద్రబాబు అవినీతిపై నారా లోకేష్ మాట్లాడకుండా టీడీపీ నేతలను రెచ్చగొడుతూ అల్లర్లు సృష్టిస్తున్నారని ఆరోపించారు. బీ తాండ్రపాడు పరిధిలోని టీవీ 9 ప్రజానగర్ కాలనీ సర్వే నంబర్ 277/7లోని 1.50 ఎకరాల్లో విష్ణువర్ధన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు సర్పంచ్ జయన్న అక్రమంగా ఇతర ప్రాంతాల ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి 100 కొట్టాలు వేయించారని ఆరోపించారు. విచారణ చేపట్టిన రెవెన్యూ అధికారులు నోటీస్ బోర్డులు పాతినా టీడీపీ నేతలు లెక్కచేయడం లేదన్నారు. రూ.7.20 కోట్లు విలువ చేసే గార్గేయపురం చెరువులో సర్వేనంబర్ 673-1ఏలో 1.15, 673-1బీలో 1.15, 673/2లో 1.39 ఎకరాలు, 673/3లో 2.26 ఎకరాల ప్రభుత్వ భూమిని 22ఏలో ఉన్నప్పటికీ అక్రమంగా టీడీపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి తన మనుమళ్ల పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, ప్లాట్లు వేసి అమ్ముకుని సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. దీనిపై జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన, ఆర్డీఓ హరిప్రసాద్, తహసీల్దార్ శివరాముడుకు ఫిర్యాదు చేశామన్నారు. సుమారు 10 గ్రామాలకు పైగా తాగు, సాగునీరు అందిస్తున్న గార్గేయపురం చెరువును అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడంపై లోకాయుక్తను ఆశ్రయించి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. సుంకేసుల డ్యాం పక్కనే ఉన్నా టీడీపీ సర్పంచ్ ప్రజలకు కనీసం మంచినీరు సరఫరా చేయడం లేదని, తాను రూ.25 లక్షలు ఖర్చు చేసి కొత్తగా పైప్‌లైన్ వేయించి ప్రజల తాగునీటి కష్టాలను తీర్చామని చెప్పారు. అలాగే విష్ణు అనుచరుడు పెద్ద మహేశ్వర్ రెడ్డి 2021లో 40 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి పట్టాదారు పాసుపుస్తకాలు చేయించుకుని అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని ఆరోపించారు. ఎదురూరులో 40 సవత్సరాల నుంచి వేలం వేయకుండా 74 ఎకరాల దేవదాయ ధర్మదాయ భూములను ఆక్రమించుకుని శిస్తు కట్టకుండా ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే దేవాలయ భూములను వేలం వేయించడంతో ఏడాదికి రూ.12 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే కోడుమూరు నియోజకవర్గ అభివృద్ధికి తాను ఎమ్మెల్యేగా రూ.300 కోట్ల నిధులు తీసుకువచ్చి పనులు చేపట్టామని వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిపై తాను డిబేట్‌కు సిద్ధమని ఎవరైనా రావొచ్చన్నారు. జెడ్పీటీసీ సభ్యులు ప్రసన్నకుమార్, గిరిజోన్, సచివాలయ కన్వీనర్లు వెంకటేశ్వర్‌రెడ్డి, మోహన్‌బాబు, భాస్కర్, సుంకన్న, ఎర్ర పక్కీరన్న, కృష్ణ, ప్రసాద్, సునీల్, దస్తగిరి, గ్రామ నాయకులు రామకృష్ణారెడ్డి, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలి



సీసీ రోడ్డు ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న చైర్‌పర్సన్ ఉమామహేశ్వరమ్మ

గూడూరురూరల్: సుంకులాపరమేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి భక్తులు, ప్రజలు సహకరించాలని ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ ఉమామహేశ్వరమ్మ కోరారు. కె.నాగలాపురంలోని అమ్మ వారి ఆలయం ముందు సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మంగళ, శుక్రవారాల్లో భక్తులు అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో వస్తున్నారన్నారు. వర్షాలు పడుతుండటంతో ఆలయం ముందు బురదమయంగా మారుతుందని, వంటలు వండుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాన్ని కల్పించేందుకు సీసీ రోడ్డు ఏర్పాటుకు దేవస్థానం నిధులు రూ.14 లక్షలను మంజూరు చేశామని, ఆన్‌లైన్ ద్వారా టెండర్ పొందిన సాయి కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు చేపట్టిందని తెలిపారు. 15 రోజుల్లో సీసీ రోడ్డు పనులు పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు సమస్య పరిష్కారం



మారుతీ నగర్, మ్యాటీ హోమ్స్ రోడ్డులో గ్రావెల్ వేయిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగరంలోని 38వ వార్డు స్టాంటన్‌పురంలో 24 ఏళ్లుగా సమస్యాత్మకంగా ఉన్న రోడ్డు సమస్యను కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పరిష్కరించారు. శుక్రవారం సాయంత్రం మారుతీ నగర్ మాత్స మ్యాటీ హోమ్స్ కాలనీ ప్రజలు వెళ్లేందుకు ఎమ్మెల్యే సొంత నిధులతో గ్రావెల్ వేయించి రోడ్డును బాగు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ.. గత 24 ఏళ్లుగా మారుతీ నగర్ మ్యాటీ హోమ్స్‌కు రోడ్డు లేక వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సమస్యపై 38వ వార్డు కార్పొరేటర్ గిప్సన్ తన దృష్టికి తీసుకు రావడంతో పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. త్వరలోనే సీసీ రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సమస్య పరిష్కారంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



గడివేములలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

గడివేముల: పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల సంక్షేమ పథకాలను అమలుచేస్తోందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. గడివేముల సచివాలయం-1 పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంటి పట్టాలు, రోడ్లు, డ్రైనేజీలు, ఇళ్లు మంజూరు చేయాలని పలువురు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి అర్హత ఉంటే మంజూరు చేయిస్తానన్నారు. ప్రజలను ఆప్యాయంగా పలకరించి, పథకాలు అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే జనన్నకు మద్దతుగా నిలవాలని కోరారు. వైఎస్సార్ సీపీ పాలనలో అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారుల ఖాతాల్లోకి డీబీటీ ద్వారా పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శివమల్లేశ్వరరప్ప, హౌసింగ్ ఏఈ మూర్తి, సింగిల్ విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, ఎంపీటీసీ మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న డీఏఏబీ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి

కల్లూరు: రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సమావేశంలో.. కల్లూరును కరువు మండలంగా ప్రకటించాలని ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. రబీకి సంబంధించి శనగ విత్తనాలను ఈ నెలాఖరులోగా అందించాలని కోరారు. డీఏఏబీ చైర్మన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు కావాలసిన ఎరువులు, మందులు అందుబాటులో ఉంచారన్నారు. పంట విత్తు నుంచి విక్రయం వరకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులకు ప్రభుత్వం అందించే రాయితీ వర్తిస్తుందని, రైతులు సాగు చేసిన పంటలను ఆర్‌బీకేలో వీఏఏ, వీహెచ్ఏలను కలిసి పంట నమోదు చేసుకోవాలన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కేశవరెడ్డి, ఏపీఎంఐపీ ఏపీడీ కృష్ణారెడ్డి, పట్టు సంవర్ధక శాఖ అధికారి విజయ్, పశువైద్యుడు డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, ఏఓ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోడుమూరు/గూడూరు: గూడూరు విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ జేసన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పులకుర్తి లిఫ్ట్ ఫీడర్ల లైను మరమ్మతులు, 33-11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనులు జరుగుతున్న కారణంగా గూడూరు, సి.బెళగల్, కోడుమూరు మండలాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తామని, వినియోదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

కొర్ర పంటను పరిశీలించిన కదిరి రైతులు



కొర్ర పంట సాగు వివరాలను తెలుసుకుంటున్న కదిరి రైతులు

కోడుమూరు రూరల్: పట్టణ రైతు హేమాద్రిరెడ్డి సాగు చేసిన అండుకొర్ర పంటను శుక్రవారం సత్యసాయి జిల్లాలోని కదిరి నియోజకవర్గానికి చెందిన 35 మంది రైతులు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు హేమాద్రిరెడ్డి మాట్లాడుతూ 2022లో అండు కొర్ర పంటను నాలుగెకరాల్లో సాగు చేశానని, తర్వాత నుంచి మళ్లీ విత్తన సాగు చేయకుండా నీళ్లు కడితే రాలిపోయిన విత్తనాలతో ఇప్పటికి మూడుకార్లు పంట సాగై దిగుబడిని ఇచ్చిందన్నారు. ప్రస్తుతం 11 ఎకరాల్లో కొర్ర పంటను సాగు చేశానని, మరో రెండు మూడు రోజుల్లో కోత కోయనున్నట్లు హేమాద్రి రెడ్డి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా కొర్ర పంట సాగులో పాటించాల్సిన మెలకువలు, పంట దిగుబడి వివరాలను కదిరి రైతులు హేమాద్రిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు.

వైద్యులు విధుల్లో లేకపోతే ఉపేక్షించం

కర్నూలు(హాస్పిటల్): వైద్యులు సమయపాలన పాటించాలని, డ్యూటీ సమయంలో విధుల్లో లేకపోతే ఉపేక్షించేది లేదని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో పలు విభాగాల హెచ్ఓడీలు, ప్రొఫెసర్లతో విడివిడిగా సమావేశమయ్యారు. కొన్ని విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డ్యూటీ సమయంలో విధుల్లో ఉండటం లేదన్నారు. ఈ మేరకు గురువారం జనరల్ మెడిసిన్ విభాగంలో ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ విధుల్లో లేకపోతే మెమో జారీ చేశామన్నారు. ఇలాగే చాలా మంది డ్యూటీ సమయంలో విధుల్లో ఉండటం లేదని తమకు సమాచారం ఉందన్నారు. కోవిడ్ సమయం నుంచి ఆసుపత్రిలో పెద్ద డాక్టర్లు సరిగ్గా ఉండటం లేదని, కేవలం పీజీలే వైద్యం చేస్తున్నారని ప్రజల్లో బలంగా నాటుకుపోయిందన్నారు. ప్రతి ఒక్క ఆచార్యుడు ఆసుపత్రిలో ఉండాలని, రోగులకు చికిత్సతో పాటు తప్పనిసరిగా వైద్య విద్యార్థులకు బోధన చేయాలన్నారు. ఈ మేరకు ఆయా విభాగాల యూనిట్ చీఫ్‌లు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇకపై తాను తరచూ ఆకస్మికంగా వార్డులు తనిఖీ చేస్తానని, విధుల్లో ఎవ్వరైనా లేకపోతే వారిపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు.

గ్రామాల శుభ్రతలో వీహెచ్‌ఎస్‌ఎన్‌సీల పాత్ర కీలకం



మాట్లాడుతున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు: గ్రామాలను శుభ్రంగా ఉంచడంలో విలేజ్ హెల్త్ శానిటేషన్ న్యూట్రిషన్ కమిటీ (వీహెచ్ఎస్ఎన్‌సీ) పాత్ర కీలకమని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సల్కాపురం ఆరోగ్య ఉప కేంద్రంలో నిర్వహించిన వీహెచ్ఎస్ఎన్‌సీ సమావేశానికి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్య కార్యక్రమాలు, ప్రభుత్వ ఆరోగ్య పథకాలను ప్రజలకు తెలియజేయడంలో కమిటీ పాత్ర ముఖ్యమైనదన్నారు. ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి రూ. 10 వేలు చొప్పున నిధులు విడుదల చేసిందన్నారు. వీటిని గ్రామంలో పారిశుద్ధ్య పనులను ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలన్నారు. మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, పిల్లలకు సమయానుసారంగా ఇవ్వవలసిన టీకాలు ఏదేని కారణం వల్ల ఇవ్వకపోతే రెండవ విడతలో అందించాలని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు సూచించారు. రెండవ విడత కార్యక్రమం సెప్టెంబర్ 11 నుంచి 16వ తేదీ వరకు జరుగుతుందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు, గర్భిణులకు వేసిన టీకాలను యూవిన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలన్నారు. అనంతరం కల్లూరు అర్బన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేసి రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, పీహెచ్ఎన్ సోఫియా, జిల్లా కమ్యూటీ మొబిలైజర్ ప్రసాద్, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం



కె.మార్కాపురంలో డ్రాగన్ ఫ్రూట్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్నాథ్ రెడ్డి

కల్లూరు: జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని డ్వామా పీడీ అమర్నాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు మండలం కె.మార్కాపురం గ్రామంలో రెండు ఎకరాల్లో సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు ఉన్న అర్హులైన రైతులకు ఎకరాకు 225 డ్రాగన్ ఫ్రూట్స్ మొక్కలు అందిస్తున్నామన్నారు. తోట నిర్వహణ ఖర్చుల కోసం మూడేళ్లకు రూ.2లక్షల వరకు అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బస్తిపాడులో అవెన్యూ ప్లాంటేషన్, ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలించారు. త్వరగా వినియోగంలోని తెచ్చి వర్మీ కంపోస్టు, సేంద్రియ ఎరువులు తయారు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీఓ మద్దేశ్వరమ్మ, ఈసీ మధుసూదన్ రావు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న చంద్రశేఖర్

కల్లూరు: ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండించిన కూరగాయలను తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటామని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఏ.గోకులపాడు గ్రామంలో రైతు చిన్న స్వాములు రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన కూరగాయల అమ్మకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి ప్రజలకు తెలియజేశారు. అంతర పంటల లాభాలు, ప్రకృతి వ్యవసాయంలో వినియోగిస్తున్న ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, కషాయాల తయారీ గురించి వివరించారు. ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సందీప్, మార్కెంటింగ్ ఎస్ఎఫ్ఏ మల్లికార్జున, యూనిట్ ఇన్‌చార్జ్ చంద్రరేఖ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మహేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

గడివేముల: ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉంటూ పుస్తకాలను చదవడం వల్ల కొత్త విషయాలను తెలుసుకుంటారని జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి అన్నారు. శుక్రవారం గడివేముల ఎంఈఓ కార్యాలయంలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి సన్మాన కార్యక్రమం జరిగింది. జెడ్పీటీసీ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. మారుతున్న పరిస్థితులు, సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన బిలకలగూడూరు ఎంపీయూపీ పాఠశాల టీచర్ హేమలత, గని ఎంపీపీఎస్ ఉర్దూ జీనత్ స్కూల్ - జహాన్, మంచాలకట్ట ఎంపీయూపీ - విజయకుమారి, బిలకలగూడూరు ఎంపీపీఎస్ - శ్యామల, కరిమద్దెల ఎంపీపీఎస్ - పద్మిని, గని ఎంపీపీఎస్ - ఎల్ల నాగిరెడ్డి, సోమాపురం ఎంపీపీఎస్ - అబ్దుల్‌రవూఫ్, ఆళ్లగడ్డ ఎంపీపీఎస్ - ఉమామహేశ్వరరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఎంఈఓ-2 విమలా వసుంధరదేవి, కార్యవర్గ సభ్యులు జేసీ నరసింహులు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రతి ఒక్కరూ మనోధైర్యం కలిగి ఉండాలి



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గూడూరు రూరల్: ప్రతి ఒక్కరూ మనో ధైర్యం కలిగి ఉండాలని సైకియాట్రిస్టు డాక్టర్ శివకుమార్ సూచించారు. పెంచికలపాడులోని విశ్వభారతి ఆసుపత్రిలో శుక్రవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య విద్యార్థులు, పారా మెడికల్ విద్యార్థులు, ఇతర స్పెషాలిటీ వైద్యులకు ఆత్మహత్య నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాపరమైన ఒత్తిడి, మానసిక ఆరోగ్య సమస్యలు, బంధుత్వ సమస్యలు, సైబర్ బెదిరింపులు, ఏమోషనల్ సపోర్టు లేకపోవడం వంటి కారణాలతో పలువురు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. ఆత్మహత్యలను నివారించేందుకు విద్యార్థుల్లో మనో ధైర్యాన్ని పెంపొందించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

గూడూరు: పట్టణంలోని తెలుగువీధిలో గంగ పుత్ర చౌడేశ్వరి వెల్‌ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చౌడేశ్వరి అమ్మ వారి నూతన విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ కార్యక్రమాలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధనరెడ్డి వేరువేరుగా హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. వారి వెంట మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు, వైస్ చైర్మన్‌లు పీఎస్ అస్లామ్, బోయ లక్ష్మన్న, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ జే.ఆబుల్, సచివాలయ కన్వీనర్ ఎల్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీజీ పరీక్షలకు 31 మంది గైర్హాజరు

కర్నూలు (న్యూసిటీ) : రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న పీజీ రెండో సెమిస్టర్ పరీక్షలకు 31 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పీజీ పరీక్షలకు ఆరు కేంద్రాలను ఏర్పాటు చేయగా 554 మందికి గాను 523 మంది విద్యార్థులు పరీక్ష రాశారని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలి



మాట్లాడుతున్న మండల వ్యవసాయాధికారి ఎస్.రవిప్రకాష్

కోడుమూరు రూరల్: ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్. రవిప్రకాష్ సూచించారు. మండల కేంద్రంలోని వ్యవసాయ అధికారి కార్యాలయంలో మండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం ఏఓ, వెటర్నరీ ఏడీ రామసుబ్బారెడ్డి, సలహా మండలి చైర్మన్ సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం జరిగింది. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏఓ తెలిపారు. మండలి చైర్మన్ సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ కౌలు రైతులకు వ్యవసాయ రుణాలు ఇప్పించాలన్నారు. పశువులకు వ్యాధులు ఉంటే టీకాలు వేయించుకోవాలని వెటర్నరీ ఏడీ చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ఏపీఎంఐపీ పథకం ద్వారా డ్రిప్ పైప్‌లకు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వెల్లడించారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలోని చెన్నమ్మ సర్కిల్ సమీపంలో 500 ఎంఎం డయా పంపింగ్ మెయిన్‌కు ఊహించని బ్రేక్‌డౌన్ కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అబ్బాస్‌నగర్, ఉద్యోగ్‌నగర్, శరీన్ నగర్, రాఘవేంద్ర నగర్, ముజఫర్ నగర్, పోలీసు కాలనీ, పంచరత్న కాలనీ, శివప్ప నగర్, నిర్మల్‌నగర్, వాసవీనగర్ (వార్డులు 26, 27, 29, 30, 31, 32, 34. 35, 36)నీటి సరఫరా ఉండదని తెలిపారు. ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు గమనించి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు.